అక్కా చెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

- పొదుపు మహిళలకు ఈనెల 23న నాల్గవ విడత 'ఆసరా' సొమ్ము విడుదల
- నియోజకవర్గంలో నాలుగు విడుతల్లో కింద 3,114 గ్రూపులకు రూ.57.23 కోట్ల లబ్ధి
- నాల్గవ విడత కింద రూ.15.25 కోట్లు జమ చేయనున్న ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న పొదుపు మహిళలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటకు ఉన్న బలం, విశ్వసనీయతను చాటారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పొదుపు మహిళల రుణాలను విడతల వారీగా మాఫీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు విడతల సొమ్ము మహిళల ఖాతాల్లో జమవగా, ఈనెల 23న నాలుగో విడత సొమ్ము విడుదల చేయనున్నారు. ఈ సొమ్ముతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు జీవనోపాధులను ఏర్పాటు చేసుకున్నారు.

కోసిగి: పొదుపు స్వయం సహాయక సంఘాల అక్కా చెల్లెమ్మలకు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం వర్తింజేశారు. గత ఎన్నికల ముందు 11-04-2019 నాటికి సంఘాల పేరుతో బ్యాంక్‌లో ఎంత రుణం ఉందో ఆ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ ఆసరా పథకం కింద మహిళల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో రుణానికి సంబంధించిన సొమ్మును ఇప్పటి వరకు మూడు విడతలు జమ చేశారు. ఈనెల 23వ తేదీన నాల్గవ విడుత సొమ్ము వారి ఖాతాల్లో నేరుగా జమచేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

3,114 గ్రూపులకు 57.23 కోట్ల లబ్ధి..

మంత్రాలయం నియోజకవర్గంలో కోసిగి, కౌతాళం ,మంత్రాలయం, పెద్దకడబూరు మండలాల్లో 3,114 గ్రూపులకు 31,140 మంది మహిళ సభ్యులకు గానూ నాలుగు విడుతల్లో రూ.57.23 కోట్లు ఆసరా పథకం కింద రుణమాఫీ చేశారు. కోసిగి మండలంలో 870 గ్రూపులకు నాలుగు విడుతల్లో రూ.21.31 కోట్ల రుణం మాఫీ చేశారు. ఇందులో మెదటి విడుతలో రూ.4.92 కోట్లు, రెండవ విడతలో రూ.5.12 కోట్లు, మూడవ విడుత రూ.5.31కోట్లు, నాల్గవ విడుతగా రూ.5.96 కోట్లు రుణ మాఫీ చేశారు.



పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలాల వారీగా నాల్గవ విడత విడుదల కానున్న సొమ్ము వివరాలు..

మండలం	గ్రూపులు	సభ్యులు	జమకానున్న నగదు
కోసిగి	870	8,700	రూ.5.96 కోట్లు
కౌతాళం	833	8,330	రూ.3.27 కోట్లు
మంత్రాలయం	725	7,250	రూ.3.34 కోట్లు
పెద్దకడబూరు	686	6,860	రూ.2.68 కోట్లు
మొత్తం	3,114	31,140	రూ.15.25 కోట్లు

మహిళ ఆర్థికాభివృద్ధే లక్ష్యం..

రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పథకాలు అందజేస్తున్నారు. మహిళలు చైతన్య వంతులై పొదుపు గ్రూపుల్లో చేరి సంక్షేమ పథకాలు లబ్ధి పొందుతున్నారు. కోసిగి మండలంలోని 2019 నాటికి 870 గ్రూపులు ఉండగా వైఎస్సార్‌సీపీలో అధికారంలోకి వచ్చాక 1,420 పొదుపు గ్రూపులకు పెరిగి 14,200 మంది మహిళలు సభ్యులుగా చేరారు. కేవలం ఈ నాలుగేళ్లలో 550 కొత్త గ్రూపులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు, బ్యాంక్ లింకేజీ రుణాలు, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి పథకాలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతోంది. మహిళలు వ్యాపారం, పాడి, గొర్రెల పెంపకం, కుట్టుమిషన్లు తదితర రంగాల్లో రాణిస్తూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించికుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మాట తప్పకుండా సంక్షేమ పథకాలు అమలు చేసి నిరూపించారు. పొదుపు గ్రూపులో గత 20 ఏళ్లుగా సభ్యురాలిగా ఉన్నా. గతంలో ఏ నాయకుడు రుణమాఫీ చేసిన దాఖలాలు లేవు. ఎన్నికల ముందు బ్యాంక్‌లో తీసుకున్న రుణాన్ని నాల్గు విడుతలుగా మాఫీ చేస్తానని హామీనిచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత మాఫీ చేసి మాటకు విలువ పెంచారు. మా జ్యోతి గ్రూపునకు నాలుగు సంవత్సరాల్లో రూ.4లక్షల రుణం మాఫీ అయ్యింది.

– మంగమ్మ, జంపాపురం

ఆర్థికంగా భరోసా ఇచ్చారు



కందుకూరు గ్రామంలో భవానీ గ్రూపులో సభ్యురాలిగా ఉన్నా. నాలుగేళ్లల్లో మా గ్రూపునకు రూ.3.20 లక్షల నగదు జమ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఖాతాల్లోకి నగదు జమ చేయడం సంతోషంగా ఉంది. పొదుపు మహిళలకు ఆర్థిక భరోసాను ఇస్తూ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూతతో వచ్చిన నగదుతో ఇంటి వద్ద హోటల్ నడుపుతున్నా. సంక్షేమ పథకాలతో జగనన్న ఆర్థిక భరోసా కల్పించారు.

– శారదమ్మ, కందుకూరు

మహిళలను చైతన్యవంతం చేస్తాం



మహిళలను చైతన్యవంతులుగా చేసి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నాం. గత రెండేళ్లల్లో మండలంలో 351 కొత్తగా పొదుపు గ్రూపులు ఏర్పాటు చేసి వారికి బ్యాంక్ లింకేజీ రుణాలు అందించాం. బ్యాంక్ రుణాలు సకాలంలో చెల్లించి వడ్డీలేని రుణాలు పొందేలా అవగాహన కల్పిస్తున్నాం. అర్హులైన ప్రతి ఒక్క గ్రూపు సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నాం. ఇప్పటికే మూడు విడుతలుగా రుణమాఫీ జరిగింది. ఈనెల 23న నాల్గవ విడుత సొమ్ము విడుదల కానుంది. ఆ నగదు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తారు.

– సత్యమ్మ, ఏపీఎం, కోసిగి

క్లుప్తంగా

కులగణన సర్వే వేగంగా చేయండి



కోసిగిలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే వేగంగా చేయాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి కులగణన సర్వే ప్రక్రియ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మీకు కేటాయించిన ఇంటికీ వెళ్లి సర్వే పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈనెల 19 నుంచి 28వ తేదీలోగా పూర్తి చేయాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం



పల్లకోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కౌతాళం: మండలంలోని సుళేకేరి గ్రామంలో వెలసిన వెంకావధూత ఆరాధనోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, ధ్వజారోహణ, గురుపూజ, బిల్వార్చన, అభిషేకం తదితర పూజలు చేపట్టారు. మఠం నిర్వహకుడు నాగేంద్ర ఆచార్య స్వామి ఆధ్వర్యంలో చేపట్టిన 18వ ఆరోధానోత్సవానికి చుట్టూ గ్రామాల ప్రజలే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజల్ని చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామ వీధుల్లో పల్లకోత్సవం జరిపించారు.

ఘనంగా చౌడయ్య జయంతి



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కౌతాళం: మండలంలోని మరళి గ్రామంలో అంబిగర చౌడయ్య జయంతి వేడుకలను గంగ పుత్రులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా చౌడయ్య దేవాలయం వద్ద సుప్రబాతసేవ, మహామంగళహారతి తదితర పూజలు చేపట్టారు. తుంగభద్ర నది నుంచి తెచ్చిన ప్రత్యేక జలాలతో స్వామి వారికి అభిషేకం చేసిన అనంతరం స్వామి చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి మహిళలు కలశాలతో ముందు నడవగా గ్రామంలో ఊరేగించారు. తమ కుల ఆరాధ్యదైవం జయంతిని కొన్నేళ్లుగా ఘనంగా జరుపుకుంటున్నామని స్థానికులు తెలిపారు.

రూ.50 నోటుపై బాలరాముడి ప్రతిమ



రూ.50 నోటుపై పెన్సిల్‌తో వేసిన బాలరాముడి ప్రతిమ

ఆదోనిరూరల్: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం, బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకొని రూ.50 నోటుపై బాలరాముడి చిత్రాన్ని పెన్సిల్ సాయంతో నారాయణపురం మల్లికార్జున అనే డ్రాయింగ్ మాస్టర్ చిత్రించారు. మల్లికార్జున కమ్మరచేడు హైస్కూల్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్నారు.

ఆదోని షార్ట్ ఫిలింకు అవార్డు



అవార్డు అందుకుంటున్న వీరజ్‌రాయల్

ఆదోనిఅర్బన్: పిన్ టీవీ ఆధ్వర్యంలో డైరెక్టర్ అఖిల్‌రెడ్డి నిర్వహించిన శత లఘుచిత్ర ప్రదర్శనలో భాగంగా ఆదోనికి చెందిన షార్ట్ ఫిలిం (ఆశయం) అనే షార్ట్ ఫిలింకు అవార్డు లభించింది. 78 చిత్రాలు పోటీ పడగా 20 చిత్రాలకు అవార్డులు దక్కాయని, వాటిల్లో ఆదోనికి చెందిన వీరజ్రాయల్ నిర్మించిన 'ఆశయం' అనే చిత్రానికి అవార్డు లభించింది. డైరెక్టర్ నర్సింగ్ రావు చేతుల మీదుగా అవార్డు అందజేశారని వీరజ్‌రాయల్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిరూరల్: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, నాయకురాళ్లు లలిత, పద్మావతి, మంజుల, లక్ష్మీ కోరారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సమ్మె చేస్తున్న వారికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సీఎం క్యాంపు ఆఫీసు ముట్టడిని విరమించుకోవాలని నోటీసులు అందజేశారు. కె.వెంకటమ్మ మాట్లాడుతూ తాము 41 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నామని చెప్పారు.

ఏఈఓల ప్రమోషన్లపై ప్రభుత్వం సానుకూలం



వేణుమాధవరావును సన్మానిస్తున్న ఏఈఓలు

మంత్రాలయం : రాష్ట్రంలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ప్రమోషన్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఏఈఓల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డీవీ వేణుమాధవరావు తెలిపారు. ఆదివారం ఆయన మంత్రాలయం వచ్చి ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూలబృందవానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం ఆయనను మంత్రాలయం వ్యవసాయ విస్తరణ అధికారి వి.నరసింహుడు ఆధ్వర్యంలో సన్మానించారు. త్వరలోనే ప్రభుత్వం అర్హత కలిగిన వారందరికీ ప్రమోషన్లు కల్పించనుందన్నారు. రాష్ట్ర కోశాధికారి సుభాన్ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీలో చేర్చాలి



రిలే నిరహార దీక్షలో పాల్గొన్న వాల్మీకులు

ఆలూరు: వాల్మీకుల రిజర్వేషన్లలో ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించాలని ఏపీ వాల్మీకి బోయ సంఘం (ఏపీవీబీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ డిమాండ్ చేశారు. ఆలూరులోని అంబేడ్కర్ సర్కిల్ ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. వాల్మీకుల దీక్షలు ఆదివారం నాలుగో రోజుకు చేరాయి. వివిధ గ్రామాల నాయకులు వీరేష్ మల్లికార్జున, పులి మల్లయ్య, శ్రీను, మహేశ్ తదితరులు దీక్షకు మద్దతు తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పూజారి

హొళగుంద: జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకత చాటుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారి మనోహర్ స్వామి ఆలయంలోని మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి రాగా వారికి పూజారులు తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

మూలనపడ్డ ట్రైసైకిళ్లు

హొళగుంద: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయానికి తూట్లు పడుతున్నాయి. వీధుల్లో తడి చెత్త, పొడి చెత్తను తరలించేందుకు ప్రభుత్వం పంచాయతీలకు పంపిణీ చేసిన ట్రై సైకిళ్లు హొళగుంద సమీపంలోని బళ్లారి రోడ్డు పక్కనున్న ఓ పొలంలో నిరుపయోగంగా పడిఉన్నాయి. నిర్వహణ లేక తుప్పు పట్టి విడి భాగాలు చోరీకి గురవుతున్నాయి. పంచాయతీల వారీగా మంజూరైన ఈ సైకిళ్లను వినియోగించుకోకుండా మూలన పడేసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



నిరుపయోగంగా ట్రైసైకిళ్లు

23 నుంచి సుంకులమ్మ దేవర



రాతనలో వెలసిన సుంకులమ్మ అవ్వ

తుగ్గలి: మండల పరిధిలోని రాతనలో వెలసిన సుంకులమ్మ అవ్వ దేవర ఉత్సవాలు ఈనెల 23 నుంచి రెండు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, బుధవారం మహిళలు బోనాలు సమర్పిస్తారని గ్రామస్తులు తెలిపారు. దేవర ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

బొలెరో వాహనం బోల్తా

ఆలూరు రూరల్: మిరప లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం టైరు పంచర్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. వివరాలు.. కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన రైతులు మిరప దిగుబడులు విక్రయించేందుకు కర్ణాటక రాష్ట్రం బ్యాడిగికి వెళ్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆలూరు మండలంలోని హులేబీడు గ్రామం సమీపంలో వెళుతుండగా బొలెరో టైరు పంచర్ కావడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో రమేష్, వీరన్న అనే రైతులకు గాయాలయ్యాయి. గ్రామస్తులు 108 వాహనానికి సమాచారం అందించడంతో ఆలూరు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఆదోని ఆస్పత్రికి రెఫర్ చేశారు.



హులేబీడు వద్ద బోల్తాపడిన బొలెరో వాహనం

ప్రతి ఇంటికీ కుళాయి

కౌతాళం: ఇంటింటికీ కుళాయి వేసేందుకు చర్యలు చేపట్టామని గుడికంబాలి సర్పంచ్ సిద్దేశ్ తెలిపారు. జలజీవవన్ మిషన్ కింద గ్రామానికి మంజూరైన ఇంటింటికీ కుళాయిలో భాగంగా పైప్‌లైన్ పనులకు ఆదివారం పూజలు చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చొరవతో జలజీవన్ మిషన్ కింద రూ.65లక్షలు మంజూవడంతో పనులను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ నిధులతో ఓహెచ్ఆర్ ట్యాంకుతో పాటు ఇంటింటికీ కుళాయి కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నాయకులు బసప్పగౌడ్, చిన్నఖాజా, మారెప్ప, గుడిసీల బసప్ప పాల్గొన్నారు.

25న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఆదోనిఅర్బన్: పది, ఇంటర్ పరీక్షల్లో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన వీరశైవ లింగాయత విద్యార్థులకు ఈనెల 25వ తేదీన పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలను అందజేస్తామని అఖిలభారత వీరశైవ లింగాయత మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు దండిన శివానంద, రాష్ట్ర కార్యదర్శి దేశాయ్ చంద్రన్న తెలిపారు. ఆదివారం స్థానిక భీమాస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అఖిలభారత వీరశైవ లింగాయత జాతీయ కార్యదర్శి రేణుకప్రసన్న హాజరవుతారన్నారు. ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని వీరశైవ లింగాయతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కోశాధికారి కేఎం మల్లికార్జున, సభ్యులు శరణబసప్ప, రమేష్, హోతూరు విశ్వనాథ్ పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన తిమ్మప్ప

ఆదోనిఅర్బన్: రెండు నెలల క్రితం దాడి ఘటనలో గాయపడిన అమరావతి కాలనీకి చెందిన తిమ్మప్ప (58) ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, ఆదోని వన్‌టౌన్ సీఐ తేజమూర్తి తెలిపిన మేరకు వివరాలు.. గతేడాది డిసెంబర్ 10న ఇంటి పక్కనున్న మూకన్న, భాగ్యమ్మ, గోపాల్, బాబు, ఫీరజ్ తిమ్మప్పపై దాడి చేశారు. గాయపడిన ఆయన నాటి నుంచి కోలుకోలేదు. అయితే ఆదివారం అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

10న డీటీఎఫ్ రజతోత్సవ సభలు

ఎమ్మిగనూరుటౌన్: డీటీఎఫ్ సంఘం ఏర్పడి 25 సంవత్సరాలు అవుతున్నందున ఫిబ్రవరి 10, 11 తేదీల్లో విశాఖపట్టణంలోని ఉత్తరాంధ్ర ప్రేమ సమాజం ఆడిటోరియం డాబా గార్డెన్స్‌లో డీటీఎఫ్ రజతోత్సవ మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పాతికేళ్ల ఉపాధ్యాయ ఉద్యమంలోనూ, సామాజిక ఉద్యమాల్లోను డీటీఎఫ్ ప్రత్యేక స్థానం సంపాదించుకొందన్నారు. రజతోత్సవ సభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. డీటీఎఫ్ నాయకులు రత్నం ఏసేపు, నాయకులు వెంకట్రాముడు, రామన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోసిగి: మండలంలోని పల్లెపాడు గ్రామంలో నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. అలాగే సమస్యలకు పరిష్కారం చూపుతారన్నారు. అని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగు, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

ఆదోని సెబ్ సీఐ బదిలీ

ఆదోనిరూరల్: ఆదోని సెబ్ సీఐ హరికృష్ణ చిత్తూరు రూరల్ సెబ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో కడప నుంచి సిద్దివోల్ సెబ్‌స్టేషన్ నుంచి విన్నీలతను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని అలసంద గుత్తి గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు కర్ణాటక మద్యాన్ని అమ్ముతుండగా అరెస్ట్ చేసినట్లు తాలూకా ఎస్ఐ మర్రిస్వామి ఆదివారం తెలిపారు. ఆయన నుంచి 90 ఎం.ఎల్.పరిమాణం గల 30 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.7,600 నగదు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య ఆదివారం తెలిపారు. ఆదోని పట్టణం గోకారిజెండా ప్రాంతానికి చెందిన ముస్తఫాతో పాటు మరో ఐదుగురు పేకాట ఆడుతుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు.

28,29న జాబ్‌మేళా



మాట్లాడుతున్న జయమనోజ్‌రెడ్డి

ఆదోని సెంట్రల్: పట్టణంలో కొత్తగా ప్రారంభానికి సిద్ధమవుతున్న విమల రెజెన్సీలో (ఫైవ్ స్టార్ హోటల్) పని చేయుటకు ఈ నెల 28,29వ తేదీల్లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యువనాయకుడు జయమనోజ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విమల రెజెన్సీని ఈ ఏడాది ఏప్రిల్ 5న ఉగాది పర్వదినం సందర్భంగా ప్రారంభించనున్నారని చెప్పారు. గ్లోబల్ ఇన్‌వెస్టర్స్ సమ్మిట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పర్మిషన్ తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 250 మంది ఉద్యోగుల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి 45 రోజులు పాటు శిక్షణ ఇస్తారని, ఈ సమయంలో రూ.5వేల నుంచి రూ.8వేలకు స్టైఫండ్ ఇస్తారన్నారు. రెజెన్సీలోనే హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విమల రెజెన్సీ ఎండీ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఇందులో దశల వారీగా వెబ్ అండ్ ఇంటర్ నెట్ సౌకర్యంతో పాటు ఫ్యాషన్ డిజైన్, సూపర్ మార్కెట్, ఫుడ్ కోర్టు, ప్లేజోన్, న్యూట్రిషన్ అండ్ బ్యుటీషియన్ వంటివి ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు విమల రెజెన్సీ.కం ఓపన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా, కౌన్సిలర్లు మహమ్మద్ స్వామి,అశోక్ నాయకులు వినోద్‌రెడ్డి,ఉరుకుంద పాల్గొన్నారు.

ఇంటింటికీ జై శ్రీరాం



ఇంటి గోడకు శ్రీరాం నామాన్ని వేస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: అయోధ్యలో శ్రీరాముని విగ్రహం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం రామజన్మ భూమి సభ్యులు మనోహర్‌తో పాటు భక్తులు ఇంటింటికీ జై శ్రీరాం నామాన్ని అచ్చు వేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సింధూరం కలర్‌తో 'ఓం జై శ్రీరాం' రాశారు. రామజన్మభూమి సభ్యుడు మనోహర్‌శెట్టి మాట్లాడుతూ అయోధ్యపురంలో ఉన్న ఆలయంతో కూడిన శ్రీరాముని జెండాను కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. సోమవారం పాండురంగస్వామి ఆలయంలో ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు. అభయాంజనేయస్వామి ఆలయం నుంచి విక్టోరియాపేటలో వెలిసిన శ్రీరాముని ఆలయం వరకు శోభాయాత్ర ఉంటుందని చెప్పారు.

27 నుంచి ఫుట్‌బాల్ టోర్నీ

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వరస్వామి జాతర మహోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 27వ తేదీ నుంచి వైఎస్సార్ అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం టోర్నమెంట్ ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. ఆర్గనైజర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, విశ్వనాథ్‌రమేష్ మాట్లాడారు. ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.1,00,116, ద్వితీయ బహుమతి రూ.50,116, తృతీయ బహుమతి రూ.20,116 ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నెంబర్ 94408 64732, 94904 85159 నంబర్లను సంప్రదించాలన్నారు.

రామయ్య వేడుకకు వేళాయే



శ్రీరామ చిత్రపటం ఊరేగింపులో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం

మద్దికెర: అయోధ్యలో సోమవారం శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం పురస్కరించుకొని ఆదివారం స్థానిక కోదండ రామస్వామి ఆలయం నుంచి రాంనగర్‌లోని రామస్వామి ఆలయం వరకు అయోధ్యరాముడి చిత్రపటాన్ని ఘనంగా ఊరేగించారు. ముందుగా ఆలయంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఊరేగింపు కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. గ్రామంలో వీధులన్నీ కాషాయం జెండాలతో అలంకరించారు. ఊరేగింపులో మహిళల కోలాట నృత్యాలు అందరినీ ఆకర్షించాయి.

శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం

ఆస్పరి: ఆస్పరి సమీపంలో శ్రీరాముడు నడియాడిన నేల రామతీర్థంను భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రంగా భక్తులు కొలుస్తున్నారు. త్రేతాయుగంలో శ్రీరాముడు అరణ్యవాసంలో భాగంగా ఈ ప్రాంతంలో ఒక రోజు నిద్రించాడని పురాణాలు చెబుతున్నాయి. శ్రీరాముడు పూజ చేసేందుకు ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించాడని అభిషేకం చేసేందుకు జలం లేకపోవడంతో బాణం సంధించగా కొలను ఏర్పాటైందని ప్రతీతి. ఆ నీటితో శివుడికి అభిషేకం చేయడం వల్ల ఈప్రాంతానికి రామతీర్థంగా పేరు వచ్చింది. ఆ తరువాత శ్రీ కృష్ణదేవరాయల కాలంలో ఇక్కడ ఆలయాన్ని నిర్మించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా ఈ కొలనులో మాత్రం నీరు ఉంటుంది.

నేడు ప్రత్యేక పూజలు: అయోధ్య రామమందిరంలో శ్రీరాముడు కొలువుదీరనున్న సందర్భంగా శ్రీరాముడు నడియాడిన నేల రామతీర్థంలో సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అలాగే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు.